4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 7 మే 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## దివాలాకోరు మాటలు

**తెలంగాణ** వెనుకబడిన ప్రాంతమనేవారు ఉమ్మడి ఏపీ రోజుల్లో. అయితే, తెలంగాణ వెనుకబడిన కాదు వెనుకవేయబడిన ప్రాంతమనేది తెలిసిందే. తెలంగాణ మొదటినుంచీ సంపన్న రాష్ట్రమనేది చరిత్రలో నమోదైన నిఖార్సయిన నిజం. కాకపోతే ఇక్కడి ఆమ్దానీ అక్కడ ఖర్చు చేయడం వల్ల తెలంగాణ నీరసించిపోయేది. నిధులు, నీళ్లు, నియామకాల్లో అన్యాయం జరుగుతున్నదని బరిగీసి కొట్లాడింది అందుకే. స్వరాష్ట్రం తెచ్చుకొని దేశం మెచ్చేటట్టు అభివృద్ధి పరచుకున్నదీ మనకు ఆ శక్తి ఉండటం వల్లనే. కేసీఆర్ దీక్షాదక్షతల ఫలితంగా మన జీఎస్డీపీ 2014-2024 మధ్య దశాబ్దకాలంలో 196 శాతం పెరిగింది. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ జీడీపీ పెరుగుదల 134 శాతం ఉండటం గమనార్హం. ఈ దశాబ్దకాలంలోనే తలసరి ఆదాయం 2014-15లో రూ.1,24.104 నుంచి 2023-24లో రూ.3,47,299కి అంటే రెట్టింపు పైగా పెరిగింది. జాతీయ సగటు రూ.2.2 లక్షలతో పోలిస్తే ఇది ఒకటిన్నర రెట్లు ఎక్కువ.

వ్యూహాత్మక పెట్టుబడులు, సంస్కరణల ఫలితంగా తెలంగాణ అంగలు వేసిందని ఆర్థికవేత్తలు కొనియాడారు. పుస్తకాలూ రాశారు. తెలంగాణ ప్రగతి దేశానికే ఓ మోడల్‌గా నిలిచింది. సంపన్న తెలంగాణను మరింత సుసంపన్నంగా నిలబెట్టింది కేసీఆర్. అవార్డులు, రివార్డులు సాధించి పెట్టింది కేసీఆర్. పైగా ఇవన్నీ సాధించింది కేంద్రం సరైన సహకారం అందించని పరిస్థితుల్లో అనేది మరువరాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేయలేదని కాదు, చేసింది. చేసిన అప్పులను సద్వినియోగం చేసింది. ప్రాజెక్టులు కట్టింది, వ్యవసాయాన్ని విస్తరించింది. గ్రామీణ, ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చింది. పరిశ్రమలను ప్రోత్సహించింది. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధిరేటు (17.93 శాతం) జాతీయ వృద్ధిరేటు (8.09 శాతం) కంటే రెట్టింపు స్థాయిలో ఉండటం బీఆర్ఎస్ ఆర్థిక విధానాలకు ఓ కితాబుగా చెప్పాలి. సంపద పెంచడం, పది మందికీ పంచడం అనే సూత్రాన్ని నమ్మిన కేసీఆర్ తెలంగాణకు మహోజ్వల శకాన్ని సాధించిపెట్టారు. ఇది ఎవరూ కాదనలేని సత్యం. ఇందుకు కేంద్రం ఇష్టమున్నా, లేకున్నా ఇవ్వక తప్పిన అవార్డులే సాక్ష్యం.


కానీ, ఇప్పుడంతా తారుమారైంది. తిట్లు, ఒట్లతో తికమక పెట్టి, హామీలు, గ్యారెంటీలంటూ గారడీ చేసి అధికారంలోకి వచ్చినవాళ్లు తమ చేతకానితనంతో రాష్ర్టాన్ని ఏడాదిన్నర కాలంలో నానాటికీ తీసికట్టు చేయించారు. ఖాళీ ఖజానా చేతికిచ్చి పోయారన్నారు. బడ్జెట్‌కు ముందు ప్రచురించే ఆర్థిక పత్రంలో వారే అంతా సజావుగా ఉందని రాసుకున్నారు. బీఆర్ఎస్ అప్పులు చేసిందని, అలా చేయడం తప్పన్నట్టుగా మాట్లాడారు. తర్వాత వాళ్లే లక్షన్నర కోట్లకు పైగా అప్పులు తెచ్చారు. వేరేవాళ్లు చేస్తే తప్పు, వాళ్లు చేస్తే ఒప్పు అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. ఆర్థికాన్ని నడపలేని అసమర్థ పాలకుడు ఇప్పుడు బజారున పడి బీద అరుపులతో ఊదరగొడుతున్నాడు. సంపద పెంచే కిటుకు తెలియక అప్పులు పుట్టడం లేదని శోకాలు పెడుతున్నాడు. ఏం చెయ్యాలో మీరే చెప్పండని చేతులు ఎత్తేస్తున్నాడు. కాంగ్రెస్ కుటుంబపాలన వారసత్వాన్ని కొనసాగిస్తూ కుంభకోణాలకు తెరతీస్తున్నాడు. మరోవైపు దివాలాకోరు మాటలతో రాష్ట్రం పరువు తీస్తున్నాడు. అడ్డగోలు హామీలు ఇచ్చినప్పుడు తెలియదా? పేరుపేరునా దేవుళ్ల మీద ఒట్లు వేసినప్పుడు తెలియదా? ఈ వాలకం చూస్తుంటే ఎగవేతలకు, కోతలకు తెగబడేందుకు సిద్ధమవుతున్నదా సర్కారు? అనే సందేహాలు కలుగకమానవు.

# అడ్డగోలు ఉచితాల అనుభవమిది!

**మంత్రితో చెక్ పెట్టేందుకు బంటును ఓ గడి ముందుకు జరపడం చదరంగంలో వ్యూహమే. ఇది చదరంగంలోనే కాదు, ఎక్కడైనా వ్యూహమే. బొక్కసం ఖాళీ, అప్పులూ పుట్టడం లేదు, అసలు ఆదాయ వనరులే లేవని రాజు చెప్తే.. అసలు ఉచితాలనేవే దండుగ, వాటిగురించి ఆలోచించుకోవాలని ఒక మంత్రి అనడం కూడా బహుశా చెక్ పెట్టడానికి ముందు బంటును కదిపే వ్యూహమే. ఎవరు, ఎందుకు అనేది పక్కనపెడితే ఒక ఎత్తుగడ రేవంత్ రెడ్డిదైతే మరో కదలిక తుమ్మలది. ఇదిఉచితాలను రద్దు చేయాలనే ఆలోచనకు ముందు జరుగుతున్న నాటకీయ పరిణామమే అయితే ఒకరకంగా మంచిది, మరోరకంగా చెడ్డది. చేపలు పట్టడం నేర్పాలి కానీ, ఉచితంగా చేపలు ఇవ్వకూడదని భావించే సామాజికవేత్తలకు మంచిది. ఆ ఉచితాలతోనే జీవితాలను ఈడుస్తున్న బడుగులకు చెడ్డది.**



ప్రసేన్, 70133 58154





ఈ ఎత్తుగడ దేనికి చెక్ పెట్టడానికి? ఇస్తున్న ఉచితాలకు కోత పెట్టడానికా? ఇస్తామని చెప్పిన అనేకానేక హామీలను ఇవ్వలేం అని చెప్పడానికా? అర్థం చేసుకోవాల్సిన తలనొప్పి ప్రజలదే. కొంచెం లోతుగా ఆలోచిస్తే... ఖజానా, ఆస్తి, అప్పుల పట్టీ కాం గ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల ముందు తెలియ దా? ఎవరు గెలిచినా ఎదురవబోతున్నది ఇదే దుస్థితి అని అప్పుడు అవగాహనకు రాలేదా? వచ్చినా తులం బంగారం, స్కూటీలు, పింఛ న్ల పెంపు, రైతు బంధు పెంపు, గృహిణులకు నెల బత్తెం ఇంకా చాలా తాయిలాలను ప్రకటించారా? అవి ఇవ్వలేమని చెప్పడానికి ఈ రాజు ప్రకటనా, మంత్రి వ్యాఖ్యానం ఉపోద్ఘాతాలా?

అప్పుల బాధ వల్లనో, ప్రభుత్వం నడపలేకపోవడం వల్లనో ఇంకే ఇతర కారణం వల్లనో నిజంగా ఉచితాలను రద్దు చేయగల దమ్ము ప్రభుత్వాలకుంటే అది గొప్ప విషయమే. ఉచితాలనే ప్రభుత్వాలు స్వారీ చేస్తున్న నరమాంసం మరిగిన పులి లాంటివి. ప్రభుత్వాలు దిగితే పులి స్వాహా చేస్తది. దిగకుంటే పులికి ఆహారం దొరకదు. అప్పుడది తన మీదున్న వ్యక్తిని కిందికి తోసి మరీ తినేస్తుంది. ఈ ఆత్మబలికి ఏ ప్రభుత్వమూ సిద్ధంగా ఉండదు. ఈ ప్రహేళిక పరిష్కారానికి ఎవరో ఒకరు ధైర్యం చెయ్యడమే మార్గం. ఉచితాల పులిని వదిలించుకొని నష్టం చేసే పథకాలు కాక ప్రజలకు కావాల్సిన ఉపాధి, చౌకగా సరుకులు, ఉత్తమ విద్య, వైద్యం అందిస్తామనే నమ్మకాన్ని కలిగించే ప్రభుత్వాలు కావాలి. అది సాధ్యమా? ఈ ఉచితాల వల్ల రాష్ట్ర ఆర్థికవ్యవస్థ కుప్పకూలి ఉచితాలు కాదు గదా, అసలు ఏమీ ఇవ్వలేని దరిద్రానికి దిగజారేంత వరకూ ప్రభుత్వాలు మిన్నకుండి, ఆ తర్వాత వాటంతటవే దుక్నం కట్టేసుకునే పరిస్థితి దాపురిస్తుందేమో. అదో రకం పరిష్కారమా? ఇప్పుడు ఆ చౌరస్తాలో తెలంగాణ ప్రభుత్వం నిలబడిందా? నిజమే అయితే ఆ స్థితికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిజంగా మొండి ధైర్యం చేయగలదా? చేయడానికి సిద్ధపడుతున్నదా? అనుమానించాల్సిన పరిస్థితే మరి. ప్రభుత్వం నడపడం కేవలం గుంపు మేస్త్రి పనే అని చప్పరించేసిన మన రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం నడపడం ఆషామాషీ కాదన్న కేసీఆర్ అనే రెండు నిలువెత్తు ఉదాహరణలు ప్రజల ముందున్నాయి. అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల వలె పరుగులు తీయాలి. కానీ, అభివృద్ధితో ఓట్లు రాలవని భారతీయ పరిస్థితులు చెప్తున్నాయి. అందుకే, ఉచితాల మీదనే రాష్ట్రాలు దృష్టి పెడుతున్నాయి.

**ఉచిత పథకాలనేవి దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూపొందాలి. ప్రాజెక్టులు కట్టాలి. తాగునీరు పుష్కలంగా అందించే ఆలోచన చెయ్యాలి. రోడ్లు వెయ్యాలి. విద్యుత్తు సరఫరా పరిధిని పెంచాలి. రేపటి ఆదాయానికి ఇవ్వాల్టి ఉచితాలు కూడా కొంత దోహదపడాలి. అలా కాకుండా కేవలం పప్పుబెల్లాల పందేరంలా మన ఉచిత పథకాలున్నాయనేది నిజం. రాష్ట్రం ఏదైనా కావచ్చు. ఆరోగ్య శ్రీ ఆలోచన మంచిదే కానీ దాన్ని కార్పొరేట్ ఆస్పత్రులు కడుపారా భోంచేశాయి.**

ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకం ప్రైవేట్ కళాశాలలకు పండుగే అయింది. ఇక రైతు భరోసా, చేయూత, దీవెన, ఆసరా, తోఫా కానుక, ఇంటింటికి రకరకాల పింఛన్లు వంటి తాయిలాలన్నీ ఫలితం ఇవ్వని వ్యయాలే కదా? ఏదో ఒక రాష్ట్ర ప్రభుత్వమో, ఏకంగా కేంద్ర ప్రభుత్వమో ఒక శుభోదయాన ఉచితాలన్నీ రద్దని ప్రకటించిందనుకుందాం. ఎవరెవరి ప్రతిస్పందనలెలా ఉంటాయి? ఇది పాలన చేతగాని ప్రభుత్వం అంటుంది ప్రతిపక్షం. ఇది ప్రజా వ్యతిరేక నిర్ణయం అంటాయి వామపక్షాలు. సంక్షేమం లేని పాలన ఆత్మ లేని దేహం అం టారు ప్రతిపక్షానుకూల మేధావులు. అంద రూ కలిసి ఏకంగా ధర్నాలకు, రాస్తారోకోలకు, బంద్‌లకూ దిగిపోతారు. ఆ ప్రభుత్వాన్ని కూల్చేంతవరకూ ఉద్యమాలు ఆగవు. ఉచితా లు అనుచితాలని వీళ్లందరికీ తెలుసు. తాము అధికారంలోకి వచ్చినా ఉచితాల భారాన్ని మోయలేమనీ వీరికి తెలుసు. అయినా ఈ ఓట్ల రాజకీయ ప్రతిస్పందన మామూలే. కనుక ఏ ప్రభుత్వమూ ఉచితాల రద్దు ఆలోచన చెయ్యదు. అసలు అటువంటి ఆలోచన చెయ్యవచ్చనే సంకేతాలు కూడా ఇవ్వవు. మరిప్పుడు తెలంగాణలో వస్తున్న సంకేతాలను ప్రజలైనా, మేధావులైనా ఎలా అర్థం చేసుకోవాలి.

ఏ ప్రభుత్వమైనా ప్రస్తుత ఆదాయంలో ఉద్యోగుల జీతాలు పోను మిగిలిన సొమ్ములో 35 శాతాన్ని ఇటువంటి ఉచితాల మీదనే ఖర్చు చేస్తుంది. ఇక అభివృద్ధికి నిధు లెక్కడి నుంచి వస్తాయి. ఈ వ్యవహారం లోటుకు దారితీస్తుంది. ప్రజలు అనవసర వ్యయాలకు అలవాటుపడతారు. ధరలు పెరుగుతాయి. దాంతో డిమాండ్, సప్లై మధ్య దూరం పెరుగుతుంది. ద్రవ్యోల్బణం ఏర్పడి ఆర్థికవ్యవస్థను కుప్ప కూలుస్తుంది. వెనిజులా, శ్రీలంక మన కండ్లముందున్న సాక్ష్యాలు. ఉచితాలు పెరిగితే ఎవరైనా అప్పుల మార్గానికి మళ్లడం తప్ప మరో పరిష్కారం లేదు. ఆ రకంగా ప్రతి రాష్ట్రం ఒక వెనిజులా ఒక శ్రీలంక కావడానికి ఎంతో సమయం పట్టదన్నదీ నిజం. మరి మనమేం కాబోతున్నాం. తెలంగాణలో ఏం జరుగబోతున్నది. వ్యూహాలు, ఎత్తుగడలు సర్వసాధారణం. మంత్రిని బంటు చంపొచ్చు గాక, అంతమాత్రాన గెలిచినట్టు కాదు. రాజును చెక్‌మేట్ చేసినప్పుడే ఆట ముగిసినట్టు. ఇప్పటికైతే స్టేల్‌మేట్ అయినట్టే అనిపిస్తున్నది. ఏ ఎత్తుగడలో ఏం జరిగినా తమకే నష్టమని స్పష్టంగా తెలిసిన అమాయక ప్రజాపావులన్నీ డబ్బాలోంచి బిక్కుబిక్కుమంటూ తొంగిచూస్తున్నాయి.

**ఏ ప్రభుత్వమైనా ప్రస్తుత ఆదాయంలో ఉద్యోగుల జీతాలు పోను మిగిలిన సొమ్ములో 35 శాతాన్ని ఇటువంటి ఉచితాల మీదనే ఖర్చు చేస్తుంది. ఇక అభివృద్ధికి నిధులెక్కడినుంచి వస్తాయి. ఈ వ్యవహారం లోటుకు దారితీస్తుంది. ప్రజలు అనవసర వ్యయాలకు అలవాటుపడతారు. ధరలు పెరుగుతాయి. దాంతో డిమాండ్ సప్లయి మధ్య దూరం పెరుగుతుంది. ద్రవ్యోల్బణం ఏర్పడి ఆర్థికవ్యవస్థను కుప్పకూలుస్తుంది.**



## ఒక యోధుడి చేవ్రాలు

ఒక యోధుడి చేవ్రాలు
అరుణోదయ వేళ ఉషోదయాన
అలలు ఎగసిపడుతున్నాయి
విత్తనాలు మొలకెత్తి చిగురిస్తున్నాయి
శిలలు కలగంటున్నాయి
కన్నీళ్ల నిప్పుల నెగళ్లయి నినాదాల హోరులై
కలాలు గళాలు కార్యార్థులై కదులుతున్నాయి
గులాబీలు ప్రేమకు చిహ్నాలే గాదు!
అస్తిత్వ నెత్తురును తిలకంగా దిద్దుకుంటాయి!

చరితను మలుపుతిప్పిన తొలి అడుగు
శిలను మనోహర శిల్పంగా మలిచింది
తొలకరి రైతులా
తీగతో నగను చేసినట్టు
వెదురు బరుగుతో గుమ్మినల్లినట్టు
కొలిమి ఆరలే, జెండా కిందికి దిగలే
అవమానాల్లోంచి ఆత్మగౌరవ స్వరం
అణచివేతల్లోంచి ఫీనిక్స్ పక్షిలా
బుద్ధుడి సాక్షిగా
తెలంగాణకై సమరశంఖం

వేయి నాల్కల అసత్యాలు
వేల విధ్వంసాలు
తూర్పును మథించకపోతే
పొద్దు పొడువదని తెలుసు
మబ్బులకు చెమటలు పట్టించి
ఎండలకు వణుకు పుట్టించి
పార్లమెంటు గొంతుకల్లోంచి
బిల్లును ఆమోదింపజేసి
తెలంగాణ కొమ్మును చేత పట్టుకొని
బయల్దేరాడు కేసీఆర్
మొండి చేతుల కుట్రలు ఆగలే
తెలంగాణ శ్వాస ఆగలే
అమరుల స్ఫూర్తి జలదృశ్యం జన సంద్రం
అహింసామార్గం
తొలకరి మెరుపులా
భుజాన రైతు నాగలి గుర్తు
గులాబీ పతాక రెపరెపలు
గమ్యం చేరువలో గగనాన విజయమై
తెలంగాణ స్వాతంత్ర్యానికి ఊపిరిలు

తెలంగాణంటేనే తిరుగుబాటు
తంగేడు పూల బోనాల బతుకమ్మ పోరు
ఎదలో తెలంగాణ తల్లి ప్రతిరూపం
తలవంచని ధీరత్వం
కోట్ల గొంతుకల ఆకాంక్ష
మట్టికరిచిన సమైక్య నియంతృత్వం
ఆల్చిప్పలో ముత్యంలా
ప్రతినబూనిన అస్తిత్వ పతాకం!

జై కొడ్తె జైలు, బోనులో అస్తిత్వం
కరెంటు కాల్పులు, బషీర్బాగ్‌లో మరణాలు
కల్లోలిత కర్ఫ్యూలు, హక్కుల అణచివేతలు
పద్నాలుగేండ్ల నిరీక్షణలు
ఎవరు జై కొట్టినా అలాయి బలాయితో
తెలంగాణకే దోస్తరదిన్లు
రాజకీయాల మద్దతు కోసం ఎత్తుకు పైఎత్తులు
అలుపెరుగని ప్రయాణాలు
తెగించిన పోరు సైరన్‌లు

తెలంగాణ తల్లి
విప్లవ కెరటమై పోరాడింది
గులాబీ తోటై విరబూసింది
అందరినోట 'జై తెలంగాణ' అనిపిస్తూ
గులాబీ దండలతో రజతోత్సవానికి పరుగులు

కరీంనగర్ గర్జనలు.. ఓరుగల్లు జైత్రయాత్రలు
కామన్ మినిమం ప్రోగ్రాంలు
ఉప ఎన్నికలు, రాజీనామాలు రెఫరెండాలు
ద్రోహుల ఫిరాయింపులు
మహోజ్వల ఘట్టాలు
దిక్కులు పిక్కటిల్లే ఉరుములు

తెలంగాణ వస్తుందంటవా..?
మఖలో పుట్టి పుబ్బలో పోతుందని..
ఎక్కిరింపులు ఎగతాళులు
అసెంబ్లీలో పేరెత్తితేనే నేరం
నిషేధిత పదం నిలువెత్తు రూపం
భాష రాదని పలికిన పండితులంతా
ఎక్కడ దాక్కున్నారో..?

తల్లి గోస ముందు
అధికారం గొప్ప కాదు
రాజకీయ మకుటాన్ని ఇసిరేశారు
మది నిండా అస్తిత్వపు జెండా
మలి దశ ఉద్యమ దిశ
విశాలాంధ్ర పాటలకు పాతరేసి
సబ్బండ వర్ణాలను ఏకం చేసిన
సకలజనుల విశ్వరూపం

ఆమరణ నిరాహార దీక్షలు
డిసెంబర్ 9 అర్ధరాత్రి ప్రకటనలు
కోడి కూతకు ముందే వెనుకడుగులు
సకలజనుల సమ్మెలు, సాగరహారాలు
మిలియన్ మార్చ్‌లు, మానవహారాలు
జూన్ రెండు, రెండు వేల పద్నాలుగేండ్లు
తెలంగాణకు స్వేచ్ఛా గాలులు

విషసర్పాల విలవిలలు
రాష్ట్రాధికారం తెలంగాణోదయమై
పునర్నిర్మాణంలో
అప్రతిహత అజేయ మిసిమి
ఇప్పటికీ, ఎప్పటికీ
తెలంగాణ శ్వాసే అంటూ
ఒక యోధుడి చేవ్రాలు
పురి విప్పే గులాబీల
పరిమళాలు
రజతోత్సవాల
వసంతోత్సవాలు...



వనపట్ల సుబ్బయ్య
94927 65358

# కాళేశ్వరంపై కంటగింపు ఎందుకు?



డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్

**కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్మాణాత్మకమైన చర్చ జరగడం లేదు. రాష్ట్ర ప్రజల సాగు, తాగునీటి అవసరాలను పక్కనపెట్టి రాజకీయ కోణంలో మాట్లాడటం సరికాదు. ఒక పల్లెటూరిలోని బోరు మోటారు చెడిపోతేనే ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేసి ప్రజల అవసరాలను తీరుస్తాం. అటువంటిది ఒక పెద్ద ప్రాజెక్టులోని మూడు పిల్లర్లు కుంగిపోతే వాటికి మరమ్మతులు చేయకుండా, దానిని వినియోగంలోకి తీసుకురాకుండా కాలయాపన చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండటం హేయనీయం. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా చర్చలు, మాటలు, విమర్శలు చేయడం ద్వారా ప్రజలకు ఒరిగేదేమీ లేదు.**

ఈ రోజు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఒంటికాలుపై లేచేవాళ్లకు తెలంగాణ ప్రజల నీటి కష్టాలు తెలువదనుకోవడానికి లేదు. ఉవ్వెత్తున లేచిన తెలంగాణ ఉద్యమంలో ప్రజల వెంట నడిచినవాళ్లంతా ఇవాళ ప్రాజెక్టులపై విపరీతమైన అభ్యంతరాలు చెప్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నప్పుడే అనేక రకాలుగా ఆ ప్రాజెక్టును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేశారు. దీనివెనుక ఆంధ్ర ప్రేరేపిత మీడియా, మేధావులు, అనుయాయులున్నారని అప్పుడే తేలిపోయింది. అప్పుడు వాళ్లు లేవనెత్తిన అభ్యంతరాలు ఒకటి పర్యావరణ విధ్వంసం, రెండవది భూసేకరణ, చివరగా కరెంటు వినియోగ ఖర్చులు. వీటన్నింటి దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు సరైనది కాదనే దుష్ప్రచారం అప్పటినుంచి ఇప్పటివరకు చెలామణిలో ఉన్నది. అయితే, స్వల్పంగా పర్యావరణానికి నష్టం కలిగినా, దీర్ఘకాలికంగా పర్యావరణ సమస్యారహిత, జనహిత ప్రాజెక్టుగా ఇది మిగిలిపోతుందనేది వాస్తవం. నదీగర్భంలో నిల్వ ఉండే నీటి వల్ల, రిజర్వాయర్ల వల్ల కొత్త నీటి పర్యావరణ వ్యవస్థలు ఉద్భవించాయి. భూ సేకరణ సమస్యను దాటి ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ఈ అడ్డంకిని దాటుకొని ప్రాజెక్టు పూర్తికావడంతో మూడో విమర్శను సీరియస్‌గా ఎక్కు పెట్టినారు. ప్రాజెక్టు నిర్వహణకు విద్యుత్తు వినియోగం అనేది చాలా పెద్ద సమస్యగా చిత్రీకరించారు. అది ఒకింత ప్రజలు, సామాన్యులు నమ్మే పరిస్థితి వచ్చింది. గత పాలకులు ఆ సమస్యను ఎలా అధిగమిస్తామో ప్రజలకు అర్థమయ్యేవిధంగా చెప్పలేకపోవడంతో ఇప్పటికీ అది ఒక బేతాళ ప్రశ్నగా చూపిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు వ్యతిరేకులు కాలం గడుపుతున్నారు. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ సోయితో పరిశీలిస్తే అబద్ధాల మబ్బు తెరలు వీడి మనకు వాస్తవాలు కనబడుతాయి.




ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో చేపట్టిన ఎత్తిపోతల పథకాలను గనుక పరిశీలిస్తే.. దేవాదుల ఎత్తిపోతల నిల్వ సామర్థ్యం 8 టీఎంసీలు, అది ఎన్నడూ పూర్తిస్థాయిలో వినియోగించబడలేదు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి వారు ప్రతిపాదించిన నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలు అయితే వారు నిర్మించిన ట్యాంకుల సామర్థ్యం 2 టీఎంసీలు కూడా లేదు. ప్రాణహిత చేవెళ్లకు వాళ్లు ప్రతిపాదించిన నీటి నిల్వ సామర్థ్యం సుమారు 16 టీఎంసీలు మాత్రమే. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 145పై చిలుకు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. 16 టీఎంసీల సామర్థ్యం లేని రిజర్వాయర్లలో 145 టీఎంసీల నీటిని ఎలా నిల్వ చేస్తారని కేం ద్ర జలవనరుల సంఘం అభ్యంతరం చెప్పింది. ఇదే విషయాన్ని మన తెలంగాణ ప్రాంత ఇంజినీర్లు ప్రశ్ని స్తే ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు. నిల్వసామర్థ్యం లేని ఎత్తిపోతల ప్రాజెక్టుల నుంచి స్థిరంగా 140 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో బహుళ దశలలో నిర్మించబడిన ఈ ప్రాజెక్టుపై ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ గొంతుకలు ఇవాళ తెలంగాణ ప్రజల ప్రాజెక్టులపై ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నాయి. తెలంగాణకు ఎత్తిపోతల తప్ప మరో పద్ధతిలో నీటిని తీసుకునే అవకాశం లేనప్పుడు, కాళేశ్వరానికి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించే శక్తి ఈ విమర్శకులకు ఉన్నదా? ప్రజల ముందు ప్రత్యామ్నాయ నీటి వనరుల అభివృద్ధి నమూనాను ఏమైనా పెట్టగలిగారా? అంటే అదీ లేదు. మరి కట్టిన ప్రాజెక్టుపై విష, దుష్ప్రచారాల వెనుక ఉన్నదెవరు? తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాకుండా ఎవరి ప్రయోజనాల కోసం ఈ గొంతుకలు మాట్లాడుతున్నాయి. ఒకవేళ కాళేశ్వ రం ప్రాజెక్టులో అవినీతి జరిగి ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ అవినీతిపై విచారణ జరపాలి. దానికి బదులుగా అవినీతి జరిగిందని ప్రచారాన్ని ప్రజల్లోకి వదిలి, ప్రాజెక్టు నిర్వహణ గాలిలో వదిలేసి, తెలంగాణ ప్రాంతాన్ని ఎండబెడతామంటే అది ఏ రకమైన నీతి?

కాళేశ్వరం వినియోగంలోకి వచ్చిన తర్వాత పెరిగిన వ్యవసాయ ఉత్పత్తులతో గ్రామీణ ఆర్థికవ్యవస్థ గాడిన పడింది. సాపేక్షంగా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ముందుకెళ్లడంలో వ్యవసాయ రంగంలోని అభివృద్ధి ముఖ్య పాత్ర పోషించింది. పెరిగిన భూగర్భ జలాల వల్ల ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు తప్పాయి. మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్ దెబ్బతిన్న తర్వాత నీటి పంపిం గ్ పూర్తిగా ఆగిపోయింది. దాని ప్రభావం తర్వాత సీజన్ వ్యవసాయరంగంపై తీవ్రంగా పడింది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పీసీ ఘోష్ కమిషన్‌కు మేం విజ్ఞప్తి చేశాం. సాధ్యమైనంత త్వరగా రిపేర్లు అయినా పూర్తిచేయండి. అది కుదరకుంటే మంచిగా ఉన్న బ్లాక్ దగ్గర పాక్షికంగా నీటిని ఆపి ఎత్తిపోయమని విన్నపం చేశాం. అక్కడ ఎటువంటి ప్రయత్నం చేయకుండానే డ్యామ్ సేఫ్టీ అథారిటీకి విచారణ చేయమని అప్పగించడం ద్వారా రెండో సీజన్ కూడా నీటిని తీసుకోకుండానే వృథాగా పోయింది. ఇప్పుడు వాళ్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా మూడు బ్యారేజీలకు భూగర్భ సర్వే నిర్వహించి రిపోర్టు తయారుచేయడానికి మరో రెండేండ్లు పడుతుంది. అంటే రాబోయే రెండేండ్లు కూడా తెలంగాణ రైతులకు గోదావరి నీళ్లివ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థమవుతున్నది. మరోవైపు ఏపీలో పోలవరం పనులు నిరంతరాయంగా సాగుతున్నాయి. బనకచర్ల ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా ముందుకువెళ్తున్నాయి.

ప్రజల జీవన ప్రమాణాలతో ఆటలాడుకునే హక్కు ఎవరికీ, ఏ ప్రభుత్వానికి లేదు. ప్రజలు ప్రభుత్వాలను మార్చేది గతంలో కంటే మెరుగైన పాలన కోసమే. అందుకు భిన్నంగా వారి జీవన ప్రమాణాలను దిగజార్చితే, రాష్ట్ర ఆర్థికవ్యవస్థపై విలోమ ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు హర్షిస్తారా? దూషిస్తారా? ఆలోచించుకోండి. రాజకీయాలను అధికార మార్పిడికే వాడుకుంటే అర్థం చేసుకోవచ్చు. రాజకీయా ల కోసం ప్రజల కనీస అవసరాలను నిర్లక్ష్యం చేస్తే అది ప్రజాహిత పాలన అనిపించుకోదు.

(వ్యాసకర్త: తెలంగాణ వికాస సమితి)





## వక్ఫ్‌ను అమలు చేయబోం



**అల్లర్లను బయటినుంచి బెంగాల్‌లోకి తీసుకొచ్చి హింస సృష్టిస్తున్నారు. బీజేపీ, మత ఛాందసుల రెచ్చగొట్టే మాటలు వినకండి. మీలో మీరు విభజన సృష్టించుకోవద్దు. వక్ఫ్ చట్టాన్ని మేం రాష్ట్రంలో అమలుచేయబోం.**

\- మమతా బెనర్జీ
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి